క్లుప్తంగా

3న ఇంటర్వ్యూలు

పెద్దకొత్తపల్లి: మైనారిటీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 3వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీఓ కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

మన్ననూర్ వాసి గెలుపుపై హర్షం

మన్ననూర్: తెలంగాణ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) రాష్ట్ర ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో మన్ననూర్ బ్రాంచ్‌కు చెందిన సేల్స్‌మెన్ పూరి సాయిబాబ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. సోమవారం రాష్ట్రంలోని అన్ని జీసీసీలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్న రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో దీపాలాల్ ప్యానల్ నుంచి సాయిబాబ పోటీ చేసి విజయం సాధించారు. ఈ సందర్భంగా పూలమాల, బొక్కేతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్, అకౌంటెంట్ జయరాజ్, రాములు, శ్రీనివాసులు, రమణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కార్గోస్ సర్వీస్ సేవలు ప్రారంభం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆర్టీసీ కార్గోస్ సేవల కేంద్రాన్ని సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ రాజు, లింగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారుడు బుచ్చన్నగౌడ్‌కు నివాళి

వెల్దండ: మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారుడు బుచ్చన్నగౌడ్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్, నాగరాజుగౌడ్ ఉన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

తెలకపల్లి: మండల కేంద్రంలోని కేకేరెడ్డి పాఠశాలలో పూర్వ విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయ బృందం సన్మానించారు. పూర్వ విద్యార్థి పి యశ్వంత్ జేఈఈ అడ్వాన్స్‌లో 3260 ర్యాంకు పొంది ఐఐటీ దన్‌బాద్‌లో మైనింగ్ మిషనరీ ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించాడు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, నిర్వాహకులు విద్యార్థి యశ్వంత్‌ను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ ప్రభాకర్, బాలు, అనిత, ఉపాధ్యాయులు పాషా, వాసు, కార్తీక్, నరేందర్, శ్రీశైలం, కిషోర్, విష్ణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌తండాలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి సోమవారం దాతలు విరాళాలను సర్పంచ్ అంజినాయక్ అందజేశారు. ఈ సందర్భంగా నారాయణపూర్‌కు చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి రూ.25వేలు, అదే విధంగా రాఘయపల్లికి చెందిన గోలి నర్సిరెడ్డి రూ.5116, మెండె శ్రీను రూ.5116ల చొప్పున విరాళంగా ఇచ్చారు.

పీర్ల చావిడి నిర్మాణానికి..

లింగాల: మండల కేంద్రంలోని బంజారవాడలో పీర్ల చావిడి పునఃనిర్మాణం కోసం డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ సూచనమేరకు కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌రాథోడ్ సోమవారం రూ. 50 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వీపర్ల భిక్షాటన

నాగర్‌కర్నూల్ రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాఠశాల స్వీపర్లు పట్టణంలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పాదిల రామయ్య వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి గౌడ్, వెంకటయ్య గౌడ్, అర్జున్, మహ్మద్ అలీ, రామస్వామి, నారాయణ గౌడ్, నిరంజన్, పుల్లయ్య, జయమ్మ, ఈశ్వరమ్మ, రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

కందనూలు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే రెసిడెన్షియల్ స్కూల్ టీచర్స్‌కు సంబంధించిన పరీక్షల కోసం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ దేవరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం

అచ్చంపేట రూరల్: అపరిష్కృత విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆర్డీఓ గోపిరాంకు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. గోవర్ధన్, నాచా, రమేష్, సతీష్, రాజేష్, ఆంజనేయులు, రాము, అరవింద్ పాల్గొన్నారు.

గొల్ల కురుమల సంక్షేమమే ధ్యేయం

కల్వకుర్తి రూరల్: గొల్ల కురుమల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని జిల్లెల్లలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రూ.500 కోట్లతో కల్వకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం అర్హులకు రెండో విడత గొర్రెలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, సర్పంచ్ జంగయ్య, మల్లేష్ యాదవ్, పెద్దయ్య యాదవ్, జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి రమేశ్, జగదీశ్వరీ, శ్రీనాథ్, ఎంపీడీఓ ఆంజనేయులు తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

జాతీయ రహదారి పనుల పరిశీలన

కల్వకుర్తి: మండలంలోని తర్నికల్ గ్రామ సమీపంలో చేపట్టిన జాతీయ రహదారి పనులను సోమవారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు పూర్తైతే హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. 80 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. అనంతరం తుర్కలపల్లి సమీపంలో ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ గోవర్ధన్, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, పెద్దయ్య యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

చారకొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని అచ్చంపేట్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంకితభావంతో పని చేసే వారికి పార్టీ తగిన ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్ విజేందర్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, మండల అధ్యక్షుడు రవీందర్, ఎంపీటీసీ లక్ష్మణ్, నాయకులు తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

వంగూరు: మండలంలోని ఉల్లంపల్లిలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం, రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మలాలూయాదవ్, మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు హమీద్, సతేశ్వరం, తిరుపతి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకుందాం

వెల్దండ: పశుసంపదను కాపాడుకుందామని మండల పశువైద్యాధికారి శ్యామ్‌సుందర్ అన్నారు. సోమవారం మండలంలోని బుడ్డోనిపల్లి, కొట్ర గ్రామాల్లో పశువులకు గాలికుంటు, చర్మవ్యాధి నివారణ టీకాలలు వేశారు. సీజనల్ వ్యాధులపై పాడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీటీసీ రాములు, సిబ్బంది నర్సింహా, శ్రీనువాసులు, బాలు, రైతులు తదితరులు ఉన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో సోమవారం పశువులకు గాలి కుంటువ్యాధి, లంపీ స్కిన్ నివారణ టీకాలు మండల పశువైద్యాధికారి శివకుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజేందర్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

తెలకపల్లి: ప్రతి పశువుకు టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి నాగరాజు యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కమ్మరెడ్డిపల్లి, పెద్దపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో పశువులకు గాలికుంటు, ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు వేశారు. కమ్మరెడ్డిపల్లిలో 300 ఆవుజాతి పశువులకు, 258 గేదె జాతి పశువుల్లో టీకాలు వేశారు. పెద్దపల్లిలో 456 గేదె జాతి పశువులు, 535 ఆవుజాతి పశువులు టీకాలు వేశామని అధికారులు తెలిపారు. ఈ నెల 2న మండలంలోని అనంతసాగర్, నడిగడ్డలో ఈ శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు యాదవ్, కమ్మరెడ్డిపల్లి సర్పంచ్ సుల్తాన్, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కొట్రలో పశువులకు టీకా వేస్తున్న వైద్యుడు

మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



చారకొండలో ప్రజావాణికి హాజరైన అధికారులు

కొల్లాపూర్: జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ రాజయ్యపై ముదిరాజ్ సంఘం నాయకురాలు నీరజ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ముదిరాజ్ సంఘ భవనం నిర్మాణం విషయంలో న్యాయస్థానాలకు తప్పుడు నివేదికలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. తూర్పు కుమారస్వామి, కోట్ల శేఖర్, సురేష్ ఉన్నారు.

చారకొండ: తక్షణమే ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కారం చేయాలని మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఆయన హాజరయ్యారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం రెండు ఫిర్యాదులు అందాయి. అనంతరం స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రజావాణికి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ జయసుధ, ఏఓ చిన్న హుస్సేన్, ఏపీఎం బాలచందర్, అధికారులు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగులలో అక్రమంగా కల్వకుర్తి కాలువ మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా తరలిస్తున్నారని సోమవారం ఎల్లికల్, పంజుగుల గ్రామాలకు చెందిన పలువురు తహసీల్దార్ రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎల్లికల్, పంజుగుల ఉప సర్పంచ్‌లు బిచ్యానాయక్, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, చంద్రారెడ్డి, కొండల్ ఉన్నారు.

ప్రజావాణికి అధికారుల డుమ్మ

తాడూరు: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహ్మద్ అలీ, ఏఓ రమేష్ కుమార్ మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు గైర్హజరయ్యారు.

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని కొడుపర్తిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన గ్రామస్తుడిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనాల చోరీకి యత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి ఆవరణలో నిలిపి ఉన్న ద్వి చక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు గుర్తు తెలియని వ్యక్తులు ఆస్పత్రి ఉన్న బైక్‌లను తరలించి జిల్లా కేంద్రంలో పలుచోట్ల వదిలేసి వెళ్లారు. ద్విచక్ర వాహనాలను గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ చేస్తున్నామని ఎస్ఐ మహేందర్‌ను తెలిపారు.

పార్టీకి నష్టం చేస్తే ఊరుకోం

కల్వకుర్తిరూరల్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టి పార్టీకి నష్టం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్ హెచ్చరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీకి ద్రోహం చేసేవారిపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని కొందరు ఓర్వలేక పార్టీని నష్ట చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అభినందన

కల్వకుర్తి రూరల్: సాగుకు సంబంధించిన వివరాలను శివ అగ్రి క్లినిక్ యూట్యూబ్ ద్వారా రైతులను చైతన్యం చేస్తున్న కల్వకుర్తి పట్టణానికి చెందిన శివకుమార్‌ను సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని శివ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు రాష్ట్రాల్లో కొత్త సాగు విధానాలు, వ్యవసాయ యంత్రాల వాడకంపై చేసిన వీడియోలను మంత్రి తిలకించారు. రంగారెడ్డి జిల్లా రైతు జైపాల్ సాగు చేస్తున్న అవకాడో పంట వివరాల వీడియోను శివ ప్రదర్శించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

అమ్రాబాద్: మండలంలోని కొత్తపల్లిలో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. పన్నెండు లీటర్ల నాటుసారా, 30 కిలోల నల్లబెల్లం, 50 కిలోల పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మీచత్రునాయక్‌పై కేసు నమోదు చేశారు.

దళితులపై వివక్ష తగదు



నాగర్‌కర్నూల్‌రూరల్: దళితులపై ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి ఆరోపించారు. సోమవారం ఆ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న దళిత, గిరిజనులకు పట్టాలివ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గూట వెంకటస్వామి, మారేడు శివశంకర్, చిన్నపాగ శ్రీను, జెట్టి ఊత్తయ్య, గడ్డం శ్రీను, దాసరి బాలకృష్ణ, బండి శివరాములు, రామస్వామి, కరీం పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పట్టణానికి చెందిన శ్రీనివాస్ 10 కుర్చీలను బహూకరించాడు. సోమవారం తన కుమారుల పుట్టినరోజు సందర్భంగా కుర్చీలు అందజేసినట్లు దాత తెలిపాడు. కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

లింగమయ్యకు పూజలు



మన్ననూర్: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ మన్ననూర్‌లోని లింగమయ్య స్వామి ఆలయంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అచ్చంపేట నియోజక వర్గంతో పాటూ రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో విజయం సాధించాలని స్వామివారిని వేడుకునట్లు వివరించారు. మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, సుజాత, చిట్టెమ్మ, అలివేల, ఎంపీటీసీలు బాలమ్మ, రహీం, శ్రీనువాసులు, మండల అధ్యక్షుడు పంబలి బుచ్చయ్య, వెంకటరమణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్లకు చేరిన కృష్ణమ్మ

పెంట్లవెల్లి: జూరాల నుంచి దిగువకు వరద పోటెత్తడంతో కృష్ణానది పరుగులు పెడుతోంది. మండలంలోని జటప్రోలు, సోమశిల, మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల పుష్కరఘాట్లలోకి వరదనీరు చేరుకుంది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ దామోదర్ తెలిపారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని బుడగ జంగాల కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాసవీ వనితా గోల్డ్ క్లబ్ సభ్యులు సోమవారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అర్థం శ్రీనివాసులు, ఒరుగంటి కిషోర్ కుమార్, అర్థం రవి, రాంప్రసాద్, శ్రీనివాస్, ప్రదీప్, చిత్తనూరు శ్రీదేవి, రాధిక, శ్రీవాణి, శారద తదితరులున్నారు.

డిజిటల్ తరగతులు ప్రారంభం

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు, గోప్లాపూర్, జటప్రోలులోని ఉన్నత పాఠశాలల్లో సోమవారం డిజిటల్ తరగతులను పెంట్లవెల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం బలరామకృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



నాగర్‌కర్నూల్ క్రైం: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని హోంగార్డులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. చనిపోయిన హోంగార్డుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలని, రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హోంగార్డులు రాజమల్లయ్య, యాదయ్యగౌడ్ తోపాటు పలువురు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కల్వకుర్తి మండలం యంగంపల్లిలో..

కల్వకుర్తిరూరల్: మండలంలోని యంగంపల్లిలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న చెన్నమ్మకు ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి ఆర్థికసాయం నిమిత్తం రూ.5వేల నగదును సభ్యులకు ఇవ్వగా ఈ మేరకు సోమవారం గ్రామంలో బాధితురాలికి నగదు అందజేశారు. కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రామకిష్టయ్య, యాదయ్య, బాలకృష్ణ, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని అల్లంతోటబావి తండాకు చెందిన ఇస్లావత్ అఖిల అనారోగ్యంతో బాధపడుతుండటంతో సోమవారం ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో సభ్యులు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

చారకొండ: మండంలోని జూపల్లి గ్రామానికి చెందిన కడారి శంకరమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం గ్రామంలో మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట జూపల్లి వెంకటయ్య యాదవ్ ఉన్నారు.


కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

మద్దూరు: మద్దూరు ప్రాజెక్టు సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రంలోని అతిథి గృహం ఎదుట నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఆయాల ఆందోళన సోమవారం కొనసాగింది. సీడీపీఓ ఇష్టానుసారంగా అంగన్‌వాడీలను తొలగించడం, మెమోలు జారీ చేయడాన్ని నిరసిస్తూ కొన్ని రోజుల కిందట అంగన్‌వాడీ టీచర్లు దీక్షలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో కూడా ధర్నాలు చేపట్టారు. అయిన ఉన్నతాధికారులు సీడీపీఓ రోజాపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు మద్దతు తెలిపారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో అధిక దిగుబడి

పెంట్లవెల్లి: డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని కొండూరు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి సతేశ్వరం అన్నారు. సోమవారం సింగవరంలో డ్రమ్ సీడర్ పద్ధతిపై ఆయన అవగాహన కల్పించారు. కూలీల ఖర్చులు, సమయం ఆదా అవుతుందని వివరించారు. డ్రమ్‌సీడర్ ద్వార సాగు చేసుకునేందుకు రైతు కుర్మయ్య ముందుకువచ్చారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇంజనీరింగ్ విదార్థి మృతి



కొల్లాపూర్: పట్టణానికి చెందిన విద్యార్థి కొత్తపల్లి కుషాల్(21) ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం కుషాల్ హైదరాబాద్‌లో కొంపల్లి మల్లారెడ్డి కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. హాస్టల్‌లో అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించినట్లు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించారు.

చట్టం అందరికీ సమానమే..

తెలకపల్లి: చట్టం ముందు అందరూ సమానులేనని తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో పౌరహక్కుల దినం నిర్వహించారు. దళితులకు అధికారులు దేవాలయ ప్రవేశం చేయించారు. గ్రామంలో కులవివక్ష పాటించొద్దని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించారు. ఎంపీఓ వెంకటయ్య, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి అనిత, ఏపీఓ మల్లేష్, ఆర్‌ఐలు రామస్వామి, శ్రీనివాసరావు, కృష్ణయ్య, బక్కమ్మ పాల్గొన్నారు.

